
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి 5 జిల్లా వార్తలు

మంగళవారం 2 ఏప్రిల్ 2024






రంజాన్ వేళలు

ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6.34

సహర్ - బుధవారం
ఉదయం - 4.46



- అసెంబ్లీ ఎన్నికల్లో నెల ముందే హంగామా
- లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులు ఖరారైనా ప్రచారం కరువు
- అంతర్మథనంలో నాయకులు, కార్యకర్తలు
- సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్
- ప్రచారం ప్రారంభించిన బీజేపీ

"లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో క్షేత్రస్థాయిలో ప్రధాన రాజకీయ పార్టీల్లో సందడి కరువైంది. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల్లో ఉన్న జోష్ ఈ ఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు ఖరారై పది రోజులు గడిచినా ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం లేదు. తమ పార్టీ అభ్యర్థి నుంచి తమకు ఇంకా ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఆయా పార్టీ నాయకులు, ముఖ్యకార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. అంతే కాకుండా ఇప్పటి నుంచే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తే ప్రచార ఖర్చు తడిసి మోపడవుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

కనిపించని సందడి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినా కదలని నేతలు


వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/రంగారెడ్డి అర్బన్ ఏప్రిల్1: కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలని నిర్ణయించే లోక్‌సభ ఎన్నికలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతూ ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో ఇంకా ఆ సందడి కానరావడం లేదు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితం కావడంతో పల్లెల్లో ఎన్నికల సందడి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వచ్చేనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థిత్వం ఖరారు కాగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరపున మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ కాసానిజ్ఞానేశ్వర్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరపున పట్నం సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ తరపున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరపున లక్ష్మారెడి బరిలో నిలిచిన విషయం విదితమే. అభ్యర్థులు ఖరారై పది రోజులు గడిచిపోయినా ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓటర్ల వద్దకు రావడం లేదని, కనీసం తమకే ఓటు వేయాలని కూడా కోరడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. గత నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా సెప్టెంబరు నెల నుంచే ముందస్తు ఎన్నికల ప్రచారం కొనసాగుతూ వచ్చింది. రెండు నెలల పాటు కొనసాగిన ఎన్నికల ప్రచారంతో పట్టణాలు, గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించినా.. కొన్ని గ్రామాల్లో ఒకటికి రెండుసార్లు కూడా ప్రచారం నిర్వహించగలిగారు.

కనిపించని ఉత్సాహం

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల తరఫున మండల స్థాయి నాయకులు ప్రచార బాధ్యతను తమ భుజాన వేసుకుని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఇంటింటికి తిరిగి ఓట్లు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తల్లో కనిపించిన జోష్ లోక్‌సభ ఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పుడు కొనసాగుతున్న లోక్‌సభ ఎన్నికలకు మధ్య వ్యత్యాసం చూసి నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా ఓటర్లు ఆశ్చర్యపోతున్నారు. ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో ఓట్ల కోసం తమ చుట్టూ తిరిగిన నేతలు ఇప్పుడు తమ గురించి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్టోబరు, నవంబరు నెలల్లో పట్టణాలు, గ్రామాల్లో రోజూ విందు భోజనాలు, మద్యం పార్టీలు కొనసాగాయి. నాయకులు ఓటర్లను పోటాపోటీగా కలిసి తమ పార్టీకే మీ ఓటు వేయాలని అభ్యర్థించేవారు. కనిపించిన ప్రతి ఓటరును గౌరవంగా పలకరించేవారు. ఎన్నికలపైనే ఆధారపడిన సీజన్ నాయకులు ప్రస్తుత పరిస్థితిని చూసి కంగుతింటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు పరిస్థితి మారడంతో విస్తుపోతున్నారు. తమకు అనుకూలంగా ఓట్లు వేయించాలని వ్యక్తిగతంగా కోరే వారే కరవయ్యారంటూ వారు వాపోతున్నారు. గత ఎన్నికల్లో కనిపించిన ఉత్సాహం నాయకులు, కార్యకర్తల్లో ఇంకా కనిపించడం లేదు.

ఖర్చుకు భయపడి...

ఇదిలా ఉంటే, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రెండు నెలలకు లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉండడంతో నామినేషన్ల పర్వం ప్రారంభమైన తరువాత పార్టీ శ్రేణులకు చేరువకావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి నుంచే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తే.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అయ్యే ప్రచార ఖర్చు తడిసి మోపడవుతుందని భావించి వెనక్కి తగ్గినట్లు చెబుతున్నారు. ఈనెల చివరి వారం నుంచి గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా ఉండే నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



ఎవరికి వారే...

ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచార సభలు నిర్వహించే సమయంలోనే నాయకులు, కార్యకర్తలు వెంట కనిపిస్తున్నారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమవుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా, వికారాబాద్ జిల్లా పరిధిలో మూడు, రంగారెడ్డిజిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లా పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి నియోజక వర్గాలు ఉండగా, మిగతా చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు హైదరాబాద్ చుట్టూ ఉన్నాయి. మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి ఏడు నియోజకవర్గాలున్నాయి. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండడంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కూడా ఆ నియోజకవర్గాలపై ఎక్కువగా దృష్టి సారించారు.

తక్కువ ఓట్లు వచ్చిన ప్రాంతాలపై నజర్!

చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున కాసాని జ్ఞానేశ్వర్‌ల అభ్యర్థిత్వం ఖరారైన విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరఫున పట్నం సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ తరఫున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడి బరిలోనిచిన విషయం విదితమే. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తుండగా, బీజేపీ అభ్యర్థి మండలాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూ ముందుకు సాగుతున్నారు. గత మూడున్నర నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిపైన ఆపార్టీ ఆశలు పెట్టుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి తక్కువ ఓట్లు వచ్చిన గ్రామాలు, ప్రాంతాలపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంతో ఉత్సాహంగా ప్రచారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల్లో అప్పటి జోష్ ఈఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. తమ పార్టీ అభ్యర్థి నుంచి తమకు ఇంకా ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 డి సమర్పించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 1 : పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం -12 డి సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో కలెక్టర్ శశాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందన్నారు.

జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం..

ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందని కలెక్టర్ చెప్పారు. అయితే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని నోడల్ అధికారులకు సూచించారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు సమర్పించే ఫారం 12డి లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఫారం-12 డి దరఖాస్తులు నోడల్ అధికారి నుండి, లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నుండి కూడా పొందవచ్చని, ఎలక్షన్ కమిషన్ పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్వో కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మే 13న నిర్వహించే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం లేదన్నారు. ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారి కృష్ణారెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై పూర్తి అవగాహన ఉండాలి

ప్రిసైడింగ్ అధికారులు ఈవీఆఎం, వీవీ ప్యాట్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే రాజేంద్రనగర్ నియోజకవర్గ సిబ్బందికి సోమవారం రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శేరిలింగంపల్లి నియోజకవర్గ సిబ్బందికి మాదాపూర్ శ్రీ వేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీలో ప్రిసైడింగ్ అధికారులు (పీ.ఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవోలు, ఏపీవోలకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రీపోలింగ్‌కు అస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వీవీ ప్యాట్‌లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్‌లో ఉంచాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. బూత్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌పై సీల్ వేయాలన్నారు. అలాగే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

వేసవి సెలవుల్లో మరమ్మత్తులు చేపట్టాలి

వేసవి సెలవుల్లో అమ్మ, ఆదర్శ పాఠశాల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీచే ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక వసతుల మెరుగుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని డీఈవోను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, టాయిలెట్లు నిర్మాణ పనులు, విద్యుత్, పెయింటింగ్ వంటి పనులను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులు బయట తిరుగొద్దని తెలిపారు. ఎండ వేడిని తట్టుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలకు పనులకు వచ్చి ఉదయం 11 గంటల వరకు పనులు చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో పీడిని ఆదేశించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు: కలెక్టర్

వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. తాగునీటి సమస్య, ఉపాధిహామీ, వేసవిలో తీసుకునే జాగ్రత్తలపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాన్నారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని తెలిపారు. పనిచేయని బోరు బావులను, చేతి బోర్లను మరమ్మతులతో పునరుద్ధరించాలని, నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలని అన్నారు. క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు సమన్వయంతో నీటి సరఫరా చేయాలని, నీటి లభ్యత, సరఫరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నీటి సమస్య ఏర్పడే ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ, మండల స్థాయి అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణతో తాగునీటి సమస్యను అధిగమించాలని సూచించారు.

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 1 : కేసీఆర్ పాలనలో సంక్షేమానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి చేవెళ్ల పారమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై నుంచే రాజకీయం నేర్చుకున్నానని.. ప్రాణమున్నంత వరకు ఈ ప్రాంత అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. గడ్డు పరిస్థితిలో కొందరు పార్టీని వీడటం సరికాదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల విజన్‌తోనే చందనవెల్లిలో అనేక పరిశ్రమలు వచ్చాని గుర్తు చేశారు. పార్టీ మారిన రంజిత్‌రెడ్డికి ఎన్నికల్లో మన తడాకా చూపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 33 వేల మెజార్టీ తీసుకరావాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని సూచించారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంతం ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ ఛైర్మన్ పి. కృష్ణారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

భగభగ..!

మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 41.9 డిగ్రీలు నమోదు



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 1 : ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్న సమయంలో నిప్పులు కురిపిస్తుండటంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. వారం రోజుల క్రితం మామూలుగానే ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జనం తట్టుకోలేక పోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లా కేపీహెచ్‌పీలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని టీపీఎస్ నగర్‌లో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



శిక్షణలో మాట్లాడుతున్న ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1: పార్లమెంటు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని, పీవోలు, ఏపీవోలు పద్ధతి ప్రకారం విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. సోమవారం శేరిగూడలోని శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పీవోలు, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి రోజు శిక్షణలో పీవోలు, ఏపీవోలు 688మంది పాల్గొన్నట్లు ఆర్డీవో కె.అనంతరెడ్డి తెలిపారు. మంగళవారం జరిగే శిక్షణలో మరో 685మంది పాల్గొంటారని ఆయన చెప్పారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల సిబ్బంది నుంచి దరఖాస్తులు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

ఆమనగల్లు, ఏప్రిల్ 1: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రముఖ వేద పండితుడు నవీన్‌శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రాలు, మేళ తాళాల మధ్య శాస్త్రోక్తంగా శ్రీ సూరమాంబ సహిత కంఠమహేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సినీ నటుడు నరేశ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారిలు పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణం , ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం విరాజిల్లి తద్వారా సమాజ శాంతి స్థాపనకు దోహద పడుతుందన్నారు. మంచి మార్గంలో నడిచే వారికి దైవానుగ్రహం లభిస్తుందని తెలిపారు. ఆకుతోటపల్లి ప్రాంత వాతావరణం తనకు బాగా నచ్చిందని ఆహ్లాదభరితమైన ఇక్కడ త్వరలో తాను షూటింగ్ చేస్తానని సినీ నటుడు నరేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కండె హరిప్రసాద్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ వరికుప్పల శ్రీనివాస్, కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌మాజీ సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ నిట్ట మంగమ్మనారాయణ, నాయకులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, లాలయ్యగౌడ్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భక్తులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న విద్యావంతుల వేదిక నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1: ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల అన్నిరకాల బిల్లులను చెల్లించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. 15 వాయిదాల పీఆర్సీ బకాయిలు, సరెండర్ సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2023 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వేతనం చెల్లించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం వరకు ప్రతీ పాఠశాలలో స్కావెంజర్‌లను నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యావలంటీర్‌లను నియమించాలన్నారు.

పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు



నర్సాగౌడ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1: కొత్తగా పార్టీలో చేరి కష్టపడి పనిచేసే వారికి తప్పని సరిగి గుర్తింపు లభిస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం మేడ్చల్ మండల మాజీ ఎంపీపీ నర్సింహాగౌడ్ ఈటల రాజేందర్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు నేడు బీజేపీ పార్టీని అధరిస్తుందన్నారు. మల్కాజ్‌గిరి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ప్రత్యేకంగా తనకు అండగా నిలిచన మేడ్చల్ ప్రజలకు ఎంతగానో రుణపడి ఉన్నానని తెలిపారు. తన విజయం కోసం పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ పార్టీలో ఎవ్వరొచ్చిన స్వాగతిస్తామని తెలిపారు. సమీప కాలంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన చాలా మంది నాయకులు తమ పార్టీలో చేరనున్నారని ఈటల తెలిపారు. నర్సింహ్మాగౌడ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌడవెల్లి గోవర్ధన్ గౌడ్ అలియాస్ గోవా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పూడూరు మాజీసర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వికారాబాద్‌కు కేటీఆర్ రాక

వికారాబాద్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రానికి బుధవారం(రేపు) మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి కేటీఆర్‌తో పాటు సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి హాజరవుతారన్నారు. వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

వికారాబాద్‌లో ఈ ఇఫ్తార్

- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి
- పెద్ద ఎత్తున తరలివచ్చిన మైనార్టీలు



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 1: రంజాన్ పండుగను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో దావత్ ఈ ఇఫ్తార్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. నవాబ్ మహమూద్ ఆలంఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకకు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని ఉపవాస దీక్షను విరమించారు ఈ వేడుకల్లో ముజాఇద్ ఆలంఖాన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అజమతుల్లా ఖాన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫహీంబాయ్, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి నాయకులు సుధాకర్ రెడ్డి, కిషన్ నాయక్, ఎర్రవల్లి జాఫర్, వాహీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆయూబ్ అన్సారీ, ముత్తహర్ షరీఫ్, వెంకటొరెడ్డి, పరశురామ్‌నాయక్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆసిఫ్, సర్వరాజ్, కరీం, రహీం పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని తాగునీటి సరఫరాపై వివిధ కాలనీలను సోమవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా బోర్‌వెల్స్, చేతిపంపులను మరమ్మతులు చేపట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మునిసిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో పర్యటించి గ్రామంలో పర్యటించే క్రమంలో పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఎక్కడా మురుగునీరు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌లు ఉన్నారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలి

ధారూరు: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా బోర్‌వెల్‌లను, చేతిపంపులను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కేరెల్లి, ఎబ్బనూర్ గ్రామాలను సోమవారం ఆయన సందర్శించి చేతిపంపులు, బోర్‌వెల్స్ పనితీరును, మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు ఎంత సరఫరా అవుతుందని, భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే తాగునీటి సరఫరా ఎలా చేస్తున్నారని ఆయన కార్యదర్శులను ప్రశ్నించారు. మిషన్‌భగీరథ నీటి సరఫరా అవుతుందని, అంతరాయం ఏర్పడితే చేతిపంపులు, సింగిల్‌ఫేజ్ మోటార్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షపీ ఉల్లాలు ఉన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



నాగిరెడ్డిపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1: రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి రైతు వేదిక దగ్గర వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతుకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. వరి ఏ గ్రేడ్ రకం రూ.2203, బీ గ్రేడ్ రకం రూ.2183ధర నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులు భూమి పాస్‌బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు ఏఈవో పంట సాగు ధ్రువీకరణపత్రం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా అధికారి రాజేశ్వర్, రాంరెడ్డి, సివిల్ సప్లయి అధికారి లక్ష్మణ్, మండల డిప్యూటీ తహసీల్దార్ రవి, మండల వ్యవసాయ అధికారి తిప్పేస్వామి, నాగిరెడ్డిపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక, వీవోఏ రాంచంద్రయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు సంగీత, రైతులు పాల్గొన్నారు.

దశల వారీగా అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు

కులకచర్ల: దశలవారీగా జిల్లాలోని అన్ని మండలాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల శాఖ డీఎం సుగుణబాయి, డీఎస్‌వో రాజేశ్వర్ తెలిపారు. కులకచర్లలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వరి క్వింటాలుకు ఎగ్రేడ్ రకం రూ.2203, కామన్ గ్రేడ్ రూ.2183గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. పంట తీసిన రైతులు ధాన్యం ఆరబెట్టుకొని చెత్త, తాలు వేరు చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మధ్యదళారులకు ధాన్యం అమ్మకూడదన్నారు. కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, సీసీ వెంకటయ్య, డ్వాక్రా సంఘాల మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ధర్మ సంస్థాపనే లక్ష్యంగా కృషి చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 1: ధర్మ సంస్థాపనే లక్ష్యంగా కృషి చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆలంపల్లి కెంపిన మఠం పూర్వ పీఠాధిపతి దివంగత శంకరస్వాముల పుణ్య సంస్మరణోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ పరిషత్ ఉపాధ్యక్షుడు మఠపతి సాంబశివశర్మ ఆధ్వర్యంలో షట్‌స్థల ధ్వజారోహణం, శంకరప్రభు మహాస్వామి గురు పీఠానికి మహా రుద్రాభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. ధర్మాన్ని ఎవరు కాపాడుతారో వారిని ధర్మం కాపాడుతుందన్నారు. ధర్మాల్లో హిందూ ధర్మం ఎంతో గొప్పదని, మహాత్మా బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనలో శంకరస్వాములు తనకంటూ ఓ ప్రత్యేకత నిలుపుకొన్నారని, తాను నేర్చుకున్న విద్యను ఇతరులకు బోధించి ఎంతో మందిని విద్యావంతులను చేశారని ఆయన గుర్తు చేశారు. దుద్దిని పీఠాధిపతి చెన్నబసవప్రభు మహాస్వామి మాట్లాడుతూ. ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఎలాంటి కష్టాలు ఎదురైనా ధర్మాన్నే ఆచరించాలన్నారు. తంగెడుపల్లి శివయోగి శివాచార్యస్వామి మాట్లాడుతూ.. ధర్మాన్ని ఆచరించే వారు తగ్గుతున్నారని, వీరి సంఖ్య పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన చెప్పారు. ముఖ్య వక్తగా హాజరైన పోలె విశ్వనాథం మాట్లాడుతూ.. శంకరప్రభు స్వాముల సేవా కార్యక్రమాలు, హిందూధర్మం విశిష్టతను వివరించారు. అనంతరం కత్తెపల్లి సచ్చిదానంద షట్‌స్థల పీఠ సంస్థాపకులు ఉమాపతయ్య స్వామి రచించిన ఏకేశ్వరోపాసన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షుడు విజయకుమార్, నూలి బసవలింగం పటేల్, ఆత్మలింగం, చెక్క వీరన్న, రామలింగంస్వామి, చంద్రశేఖర స్వామి, పార్వతయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్



చెట్టినాడు రైల్వే ట్రాక్ తొలగింపు

- రైతులకు చెల్లించని పరిహారం
- ట్రాక్‌ను తొలగించిన కాంట్రాక్టర్, రైతులు

తాండూరురూరల్, ఏప్రిల్ 1 : తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కల్లూరు సమీపంలో గల చెట్టినాడు సిమెంట్ కర్మాగారం రైల్వే ట్రాక్‌ను కాంట్రాక్టర్, రైతులు తొలగించారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని బెల్కటూర్, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, కోటబాస్పల్లి, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని పొలాల మీదుగా రైల్వే ట్రాక్‌ను నిర్మించారు. బెల్కటూర్ నుంచి చెట్టినాడు ఫ్యాక్టరీ గేటు వరకు 11 కిలో మీటర్ల మేర రైల్వేట్రాక్ నిర్మాణం చేశారు. ఈ ట్రాక్ నిర్మాణం రెండేళ్ల క్రితం పూర్తయింది. కర్మాగారం యాజమాన్యం పరిహారం చెల్లించాలని రైతులు జనార్ధన్‌రెడ్డి, కృష్ణవేణి, రాజారాం, శంకర్ సదరు కాంట్రాక్టర్ ప్రసాద్‌కుమార్‌కు కోరారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని కాంట్రాక్టర్ నిలదీశారు. అయితే చెట్టినాడు యాజమాన్యం రూ.18 కోట్ల వరకు బకాయిలు చెల్లించలేదని, అందుకు రైతులకు పరిహారం ఇవ్వడం ఆలస్యమైందని కాంట్రాక్టర్ రైతులకు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్‌తో పాటు రైతులు కలిసి కోటబాస్పల్లి శివారులోని సర్వేనెంబర్-68లో ఉన్న రైల్వే ట్రాక్‌ను కార్మికుల సహాయంతో తొలగించారు. అనేకసార్లు కర్మాగారం యాజమాన్యానికి పరిహారం కోసం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్, రైతులు తెలిపారు. గతంలో రెండుసార్లు కూడా రైల్వే ట్రాక్‌ను కాంట్రాక్టర్ తొలగించాడు. ఈ విషయమై చెట్టినాడు సిమెంటు కర్మాగారం ప్రతినిధిని వివరణ కోరగా, కాంట్రాక్టర్‌తో యాజమాన్యం మాట్లాడే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. సమస్య పరిష్కారించేందుకు యాజమాన్యం కూడా ప్రయత్నిస్తుందని వివరణ ఇచ్చారు. సిమెంటు తీసుకెళ్లేందుకు తాము రైల్వే అధికారులకు రిక్వెస్ట్ లెటర్ పెట్టిన తర్వాతనే రైల్వే అధికారులు గూడ్స్ వ్యాగిన్ పంపిస్తారని చెప్పారు.

ఉనికి కోసమే కేసీఆర్ నీచ రాజకీయాలు

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



విలేఖరులతో మాట్లాడుతున్న మల్లు రవి

ఆమనగల్లు, ఏప్రిల్ 1 : అవినీతి, అరాచక పాలనతో అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో ఉనికి కోసం నీచ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి, పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇబ్బందులు పడుతున్న, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలు, వైఫల్యాలు సరిచేస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. అవినీతికేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రైతులను, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ పేరుతో పొరుగు రాష్ట్రాల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి బీఆర్ఎస్ సర్కార్ అందినంత దండుకుందని, కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీల వైఫల్యానికి కేసీఆర్ కారణం కాదా అని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని మల్లు రవి చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, మదు, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి పరీద్, నాయకులు శ్రీకాంత్, శ్రీశైలం, ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటేయాలి

యాలాల, ఏప్రిల్ 1: దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటు వేయాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని రాస్నం, పగిడ్యాల్, బాగేపల్లి, రాఘవపూర్, కోకట్, లక్ష్మీనారాయణపూర్, అక్కంపల్లి, జుంటుపల్లి, అగ్గనూరు, తదితర గ్రామాల్లో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటి వరకు చేసిందేమీ లేదన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా బీజేపీ ప్రభంజనం కనిపిస్తోందని అన్నారు. ప్రతీ గ్రామంలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీలోఓ చేరుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, యాలాల మండల శాఖ అధ్యక్షుడు జంగం యాదగిరి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, యు.రమేష్, నాగయ్యగౌడ్, మధుగౌడ్, అరుణ్ కుమార్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయం

బషీరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీదే విజయమని, క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాశీంపూర్, గొట్టిగఖుర్దు, నవాల్గ, మర్పల్లి తదితర గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రను సోమవారం సాయంత్రం నిర్వహించారు. దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలంటే మరోసారి మోదీని ప్రధానిగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత యు.రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు మనోహర్ రావు, ఎం.నరేష్, బాలేశ్వర్‌గుప్తా, రాజ్‌కుమార్ కులకర్ణి, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు ప్రశాంత్, గంగాధర్, జగన్ ముదిరాజ్, మంతట్టి హన్మంత్‌రెడ్డి, సంగాయిపల్లి కాశీరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తే చర్యలు

కొడంగల్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియామావళి, నామినేషన్లు, పోలింగ్ ప్రక్రియ తదితర వాటిపై అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలకు కొడంగల్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, కొడంగల్, మద్దూర్ మండలాల తహసీల్దార్లు పద్మావతి, దానయ్య, సి.విజయ్‌కుమార్, బి.విజయ్ కుమార్, మహేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు సురేశ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

పోలీస్ శిక్షణ కాలం ఎంతో విలువైంది

- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1: పోలీస్ శిక్షణ కాలం ఎంతో విలువైనదని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 280మంది మహిళా అభ్యర్థులు శిక్షణ నిమిత్తం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారితో ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు శిక్షణ కాలంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణ, ఏకగ్రాతతో శిక్షణలో చెప్పే విషయాలను నేర్చుకోవాలని సూచించారు. సమయం వృథాకాకుండా శిక్షణ సమయంలో చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న ప్రతీ ఒక్క అంశం సర్వీస్ కాలంలో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులు టెక్నికల్ విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఏఈవో జోతిర్మనీ, ఏఆర్ డీఎస్పీ వీరేశం, అకాడమి నుంచి వచ్చిన అధికారులు ప్రాక్టికల్‌గా పలు విషయాలను వివరించారు.

3.5 లక్షల విలువైన 14 కిలోల గంజాయి స్వాధీనం

- కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలింపు

వికారాబాద్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రూ. 3.50 లక్షల విలువ గల 14 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మనోజ్ పరమర్, అనిల్‌ఉపాధ్యాయ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. ప్రధానంగా రైళ్లలో గంజాయి సరఫరా జరుగుతుందన్న సమాచారంతో వివిధ రైల్వే స్టేషన్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కందుకూరు, ఏప్రిల్ 1 : మండలం పరిధి నేదునూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదా, పద్మావతి, సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మార్చి 30 నుంచి రేపటి వరకు ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు వట్టిపల్లి రామశర్మ నిర్వహించారు. కల్యాణంలో నేదునూరు, మాన్యగూడ గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల మహిళలు, భక్తులు పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు తీసుకువచ్చారు. అంతకు ముందు బ్యాండు వాయిద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉన్ని వెంకటయ్య, నాయకులు సోలిపేట అమరేందర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, చందా భాస్కర్, కొత్తకాపు ప్రభాకర్‌రెడ్డి, నామని చంద్రప్రకాశ్, సోలిపేట రంగారెడ్డి, బానాల జైపాల్‌రెడ్డి, సోలిపేట స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

చేవెళ్ల, ఏప్రిల్ 1 : శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో పలు అనుమతి లేని నిర్మాణాలను సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ జేసీబీతో కూల్చివేయించారు. జన్వాడా రెవెన్యూలో అనుహర వెంచర్ నిర్వాహకులు, వంశీశర్మ, దీపికారెడ్డి, అవినాష్ రెడ్డి, కెవిరెడ్డి అనే వ్యక్తులు హెచ్ఎండీఏ, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు. గతంలో గ్రామకార్యదర్శి ప్రభాకర్ వీరికి మూడు నోటీసులు కూడా ఇచ్చారు. ఆ నోటీసులకు వారు నుంచి సమాధానం ఇవ్వకపోగా, యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టడంతో డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి, ఎంపీవో గీత ఆదేశాల మేరకు గ్రామకార్యదర్శి ఆ నిర్మాణాలను కూల్చివేయించారు. అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌లైన్

షాద్‌నగర్, ఏప్రిల్ 1 : వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా హెల్ప్‌లైన్ టీంకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని కోరారు. అందుకోసం కమిషనర్ చీమ వెంకన్న, మున్సిపల్ ఇంజనీర్ భీమా రాయుడు, వాటర్ సప్లయ్ ఇన్‌చార్జి ఖాజా ఇలియాస్ మోయినోద్దీన్, లైన్‌మెన్ ఎండీ బాబా షర్ఫోద్దీన్‌కు 8790902 74, 6300495394, 7780770958, 8977222075 ఫోన్‌నెంబర్ల ద్వారా సమాచారమందించాలని కమిషనర్ సూచించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మహిళలతో మాట్లాడుతున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 1 : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి చెప్పారు. షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రిలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వేసవి శిబిరంలో భాగంగా సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పరిశుభ్రత, విద్య, చెట్లపెంపకం, మద్యపాన నిషేదం, ఇంకుడు గుంతల తవ్వకం, నీటి సంరక్షణ, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు ఉన్న ఉద్యోగులు, నిరక్షరాస్యులు, నిరుద్యోగుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శ్రీలక్ష్మీ ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

కేశంపేట, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ తన తల్లితండ్రులు పద్మమ్మ - వెంకటయ్యల జ్ఞాపకార్థం సోమవారం మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పది సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, అనసూయమ్మ, రాజు, మల్లేష్‌గౌడ్, సంతోష్ కుమార్‌గుప్తా, యెన్నం శ్రీకాంత్‌రెడ్డి, వెంటేష్, శ్రీశైలం, హన్మంత్‌రెడ్డి, బాలాజీ, దశరథ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణశర్మకు న్యాయశ్రేష్ఠ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృష్ణశర్మ

షాద్‌నగర్, ఏప్రిల్ 1 : షాద్‌నగర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది సన్నిధానం కృష్ణశర్మ న్యాయశ్రేష్ఠ పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రిటైర్డ్ న్యాయమూర్తులు ఎం శ్రీరామమూర్తి, వెంకటరమణ ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. న్యాయరంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎస్ రామచందర్‌రావు, శృంగేరి శంకరమఠం సలహాదార్లు బంగారయ్య, దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల్లో ఎవరిని కోల్పోయినా ఉచిత విద్య

దోమ, ఏప్రిల్ 1: తల్లిదండ్రుల్లో ఎవరిని కోల్పోయినా వారికి 1 నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత విద్యతో పాటు భోజన వసతి సౌకర్యం ఉంటుందని దోమ మండల ఎంపీడీవో మహేశ్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటబాపల్లిలో 60ఎకరాల ప్రదేశంలో హిల్ ప్యారడైజ్ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1 నుంచి ఇంటర్మీడియేట్ వరకు సీబీఎస్ సిలిబస్ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. ఈ పాఠశాలలో ఏ రాష్ట్రమైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100024438, 910024435 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కడ్తాల్ : విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి, తదితరులు

కడ్తాల్/తలకొండపల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని మైసిగండి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జాభవాని దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. వేడుకల కోసం ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ మహాకుంభాభిషేకం చేసి తుల్జాభవాని దేవి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యనాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ ఎంపీటీసీ సక్రి, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నిర్వాహకులు దూద్యనాయక్, రవి, దేనానాయక్, మంగ్య, సర్వంత్, సోమ్లు, పాల్గొన్నారు.



చీపునుంతలలో విగ్రహ ప్రతిష్ఠలో నాయకులు

మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి, సుబ్రమణ్యస్వామి, శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, ధ్వజస్తంభ, శిఖర, ప్రతిష్ఠ వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు మెళ్లూరి శ్రీనివాస శర్మ, నర్సింహ, రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ లు ఉప్పల వెంకటేశ్, దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుజ్జల మహేశ్, జోగు వీరయ్య, లలితజ్యోతయ్య, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

'బార్' కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

ఆమనగల్లు, ఏప్రిల్ 1 : ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ న్యాయవాది వి. లక్ష్మణశర్మ సమక్షంలో అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, కార్యదర్శి రామకృష్ణ, లైబ్రేరియన్ ఏ. శేఖర్, కోశాధికారి మధు బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి కాటం స్వరూప హాజరయ్యారు. కోర్టు నూతన భవనాల నిర్మాణానికి, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగన్ చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు జానకిరామ్ యాదవ్, వెంకటేశ్వర్‌రావు, యాదిలాల్, కొప్పు కృష్ణ, మల్లేశ్, విజయ్‌కుమార్, శ్రీను, జగన్,



ఆమనగల్లు : జగన్‌ను అభినందిస్తున్న జడ్జి స్వరూప, తదితరులు

గణేశ్, కోర్టు సిబ్బంది మురళీకృష్ణ, పాల్గొన్నారు.

షాద్‌నగర్ : ఇటీవల ఎన్నికైన షాద్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం షాద్‌నగర్ కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో అధ్యక్షుడు రాజశేఖర రాజు, ఉపాధ్యక్షులు టి శ్రీనివాస్‌యాదవ్, విజయభాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యం శ్రీధర్, సంయుక్త కార్యదర్శి సీహెచ్ మధుసూధన్‌రావు, నరేంద్రనాథ్, కోశాధికారి రాఘవేంద్రచారి, లైబ్రెరియన్ లక్ష్మయ్య, లేడీ రిప్రంజెంటర్ జయమ్మ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు డి శంకర్, శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖరరాజు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



రాజశేఖరరాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి

కేశంపేట, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌కు తరలివెళ్లారు. ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కావలి వెంకటేష్, బాలాజీ, నారాయణ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, జంగయ్య, యాదయ్య, బాల్‌రాజ్ ఉన్నారు. కార్యక్రమంలో సుందరయ్య, కృష్ణయ్య, ప్రకాష్ గౌడ్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

శంషాబాద్, ఏప్రిల్ 1 : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని, ఈ విందు స్నేహభావం, మత సామరస్యాన్ని పెంపొందిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దూడలవెంకటేశ్‌గౌడ్ మాజీ సర్పంచ్ రేణికుంట్ల గణేష్‌గుప్తాతో పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రకాష్‌గౌడ్

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- అధికారుల ఆకస్మిక పర్యటన
- పంచాయతీ రికార్డుల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

యాచారం, ఏప్రిల్ 1 : వేసవిలో తాగు నీటి సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని, గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి రాకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె యాచారం మండలంలోని గున్‌గల్, గాండ్లగూడ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి తాగు నీటి సమస్యపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంత నీటి సరఫరా చేస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజును అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి నీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. మిషన్‌భగీరథ నీరు రాకపోతే ప్రత్యామ్నాయంగా ఏం చర్యలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు.

యాచారం మండలంలోని గున్‌గల్ గ్రామ పంచాయతీ రికార్డులను సోమవారం డీపీవో సురేష్‌మోహన్ తనిఖీ చేశారు. ఇంటి పన్ను, వృత్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామంలో తాగు నీటి సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. వారి వెంట డీఎల్‌పీవో సాధన, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి తదితరులున్నారు.

క్రీడలతో యువతలో స్నేహభావం



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మంచాల, ఏప్రిల్ 1 : క్రీడలతో శరీరదారుఢ్యంతో పాటు యువతలో స్నేహభావం పెంపొందుతుందని మంచాల ఎస్సై రవినాయక్, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్ అన్నారు. మంచాల మండల పరిధి ఆరుట్లలో జరిగిన ఆరుట్ల ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలు ముగిశాయి. ఈ క్రీడాపోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ఆరుట్ల థండర్స్ జట్టు రూ.30వేలు, ద్వితీయ బహుమతి పొందిన ఆరుట్ల లెజెండ్స్ రూ.20 వేలు, మూడవ బహుమతి పొందిన ఆరుట్ల పవర్ హిట్టర్స్ రూ.15 వేలు, నాలుగో బహుమతి పొందిన ఆరుట్ల టైటాన్స్ రూ.10 వేలు గెలుచుకున్నాయి. ఆ జట్లకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎం. సికిందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పొందాల జంగయ్య కందాల శ్రీశైలం, జానీపాష, మార సురేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, కంబాలపల్లి భాస్కర్, ముద్దం శ్రీనివాస్, మార బుగ్గరాములు పాల్గొన్నారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ విజయానికి కృషి



జయేందర్

కందుకూరు, ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ముందుండి పని చేసే జ్ఞానేశ్వర్‌కు పార్టీ అధిష్టానం బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్ల నుంచి చెరోసారి ప్రాతినిథ్యం వహించిన బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఏనాడు ప్రజల సమస్యల పరిష్కారానికి పని చేయలేదని, వారి వ్యాపారాలను వృద్ధి చేసుకోవడానికే పనిచేశారని ఆరోపించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు వారి పనితీరును పరిశీలిస్తున్నారని చెప్పారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించడానికి వారు సిద్ధమౌతున్నట్లు తెలిపారు.

ఆలయం వద్ద బోరు ప్రారంభం



మోటరును ప్రారంభిస్తున్న గ్రామస్థులు

కొందుర్గు, ఏప్రిల్ 1 : మండల కేంద్రం శివారులోని పెండ్యాల గుట్టమీద ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి పాత దేవాలయం వద్ద బోరు మోటరును సోమవారం కొందుర్గు గ్రామస్థులు ప్రారంభించారు. ఆ గ్రామానికి చెందిన ఇద్దరు దాతలు రూ.20వేలు, శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన మరో దాత రూ.20వేల రూపాయలు అందజేయడంతో మోటరును బిగించి, పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కృష్టారెడ్డి, కె రాములు గౌడ్, చేవెళ్ల కృష్ణయ్య, బి గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బోయ నర్సింలు, మల్లేష్, అంజయ్య, వెంకటేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల, ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నేడు (మంగళవారం) పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుండాల రాములు, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశానికి చేవెళ్ల ఎంపీ. రంజిత్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా కాంగ్రెస్ నేత జన్మదిన వేడుకలు



శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తలకొండపల్లి , ఏప్రిల్ 1: కాంగ్రెస్ జిల్లా నాయకుడు , శతాబ్ది టౌన్‌షిప్ ఎండి. కాసు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తలకొండపల్లి మండలం దేవునిపడకల్, లింగరావుపల్లి , రామకృష్ణాపురం, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, నాయకులు బాల్‌రెడ్డి, గట్ల రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కృష్ణా పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు



పైప్‌లైన్ లీకై వృథా అవుతున్న నీరు

యాచారం, ఏప్రిల్ 1 : యాచారం మండలంలోని తక్కళ్లపల్లి బ్రిడ్జి వద్ద సాగర్ - హైదరాబాద్ కృష్ణా పైప్‌లైన్ రెండు చోట్ల పగలడంతో నీరు వృథా అవుతోంది. ఈ విషయం సంబంధిత ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం బాగు చేసిన చోటే మరోమారు పైప్‌లైన్ పగిలి నీరు వృథా అవుతోంది. మెట్రోవాటర్ వర్క్స్ అధికారులు తక్షణమే పైప్‌లైన్ బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రెండు రోజుల పాటు నీటి తరలింపు ఆపితేనే పైప్‌లైన్‌ను బాగు చేయడం కుదురుతుందని మెట్రోవాటర్ వర్క్స్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. వేసవిలో రెండు రోజుల పాటు నీటిని ఆపితే సమస్య తీవ్రమవుతుందని భావించి పైప్‌లైన్ బాగు చేయడం లేదని తెలిసింది.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

చేవెళ్ల, ఏప్రిల్ 1 : గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతపురం గేటు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉండే మహిళ మృతదేహం రామంతపురం గేటు సమీపంలో పడి ఉంది. ఆమె ఒంటిపై ఆరెంజ్ క్రీమ్ కలర్ చీర, బ్లూ కలర్ జాకెట్ కలవు. ఆహారం సరిగా దొరకకపోవటం, ఎండదెబ్బ కొట్టడం వల్ల చనిపోయి ఉండొచ్చని అనుమనిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 1 : షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్‌లో అనూస్ పరిశ్రమ వై జంక్షన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన బాలకృష్టారెడ్డి(73) అనే వ్యక్తి హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లో నివాసముంటున్నాడు. స్వగ్రామానికి వెళ్లి మోటార్ సైకిల్‌పై తిరిగి హైదరాబాద్ వెళుతుండగా షాద్‌నగర్ శివారులో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని ఓ లారీ వేగంగా ఢీ కొట్టింది. లారీ అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తలకు హెల్మెట్ ఉన్నా అది పగిలిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

మొయినాబాద్, ఏప్రిల్ 1 : తాళం పగలగొట్టి ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని బాకారం గ్రామంలో జరిగింది. బాకరాం గ్రామానికి చెందిన ఉపేందర్‌యాదవ్ అనే వ్యక్తి మార్చి 30న సాయంత్రం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి దేవాలయానికి వెళ్లాడు. మరుగుసటి రోజు రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి మెయిన్ డోర్ తాళం పగిలిపోయి కిందపడి ఉంది. బెడ్‌రూంలో బీరువా తాళం పగల గొట్టి అందులో నుంచి బంగారం, వెండి నగలు, కొంత నగదును దొంగలు ఎత్తుకెల్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

తాండూరురూరల్, ఏప్రిల్ 1 : తాండూరు మండల పరిధిలో జరుగుతున్న ఓ బాల్యవివాహాన్ని కరన్‌కోట్ పోలీసులు అడ్డుకున్నారు. కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటబాస్పల్లికి చెందిన అబ్బాయితో కర్ణాటక రాష్ట్రం చించొళి తాలూకా మిర్యాణ్‌కు అమ్మాయితో సోమవారం వివాహం జరిపేందుకు కుటుంబీకులు నిర్ణయించారు. కోటబాస్పల్లిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం చైల్డ్‌లైన్ కమిటీ వద్దకు పంపినట్లు ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలకు పెళ్లి వయస్సు రాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డప్పు కృష్ణ ఆశయాలను కొనసాగిస్తాం



కృష్ణకు నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

షాద్‌నగర్, ఏప్రిల్ 1 : కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన డప్పు కృష్ణ ఆశయాలను కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ పిలుపు నిచ్చారు. డప్పు కృష్ణ 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీను నాయక్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో కుల వివక్షను రూపుమాపేందుకు కృష్ణ కృషి చేశారని కొనియాడారు. ఇళ్లు లేని దళిత, గిరిజనులకు స్థలాలు ఇవ్వాలని అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజశేఖర్, ఈశ్వర్ నాయక్, భుజంగరెడ్డి, మీనాజ్‌బేగం, కావలి రాజు, లక్ష్మి, శ్రీకాంత్, రమేష్, నవీన్ బుద్దుల జంగయ్య, పి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 1 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మడలం చౌలపల్లి గ్రామ శివారులో పని చేస్తున్న కూలీలతో సోమవారం ఆయన మాట్లాడారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. మోదీ అధికారంలోకి వచ్చాక పని దినాలు, నిధులు తగ్గించారని విమర్శించారు. పని ప్రదేశంలో తాగు నీటి సౌకర్యం కల్పించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. రోజుకు రూ. 600 కూలీ చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.